Nityam Nigha 13.09.26_Layout 1 9/13/2026 7:26 AM Page 1

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక



బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665
నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక
NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా
Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 72 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | ఆదివారం 13.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-



సహకారమే బ్రిక్స్ చోదకశక్తి

- ప్రధాని మోదీ

- సహకార స్ఫూర్తితోనే బ్రిక్స్ ముందుకు సాగుతోందన్న ప్రధాని మోదీ
- న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సులో నేతల భేటీ
- 'న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026'కు ఏకగ్రీవంగా ఆమోదం
- ఐక్యత చాటుతూ వృక్షోత్సవంలో పాల్గొన్న ప్రపంచ నేతలు

నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : సహకార స్ఫూర్తితో ముందుకు సాగుతూ, మరింత సమ్మిళితమైన, సంపన్నమైన ప్రపంచాన్ని నిర్మించేందుకు బ్రిక్స్ సభ్యదేశాలు కట్టుబడి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో శనివారం ప్రారంభమైన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఐక్యతకు...

మిగతా 2 వ పేజీ లో..

వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

- సీఎం రేవంత్ రెడ్డి

- గణేశ్ ఉత్సవాలపై సమీక్ష నిర్వహించిన రేవంత్ రెడ్డి
- మండపాల నిర్వహకులు పోలీస్ స్టేషన్లలో సమాచారం ఇవ్వాలని సూచన
- నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశం

నిత్యం నిఘా, హైదరాబాద్ : వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన .....

మిగతా 2 వ పేజీ లో..



రెండు ఆహార ఉత్పత్తులపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కొరడా..

- షాలిమార్స్ ధనియాల పొడిలో అధిక మోతాదులో పురుగుమందుల అవశేషాలు
- ఆక్వాగ్రి క్యారెజీనన్‌లో ప్రమాదకరమైన కాడ్మియం ఉన్నట్టు గుర్తింపు
- కంపెనీల అప్పీల్ తర్వాత ఈ-టెస్టుల్లోనూ ఉత్పత్తులు సురక్షితం కావని నిర్ధారణ



2

ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతమయ్యాయి : కిషన్ రెడ్డి

- రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ అయిన కిషన్ రెడ్డి
- ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు రక్షణశాఖ సమ్మతి తెలిపిందని వెల్లడి
- డీపీఆర్, మాస్టర్ ప్లాన్ ప్రక్రియ త్వరగా ముగించాలని నిర్ణయించామన్న కేంద్ర మంత్రి



2

25,000 క్యాబ్ డ్రైవర్ల సమ్మె..

శంషాబాద్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు

- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నిలిచిపోయిన క్యాబ్ సేవలు
- సమ్మె బాట పట్టిన సుమారు 25,000 మంది డ్రైవర్లు
- ప్రభుత్వ జీవో 46 అమలు చేయాలని ప్రధాన డిమాండ్
- ఓలా, ఉబెర్, రాపిడో ఎయిర్‌పోర్ట్ రైడ్స్‌ను బహిష్కరించిన యూనియన్



2

2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే తెలంగాణ లక్ష్యం - శ్రీధర్ బాబు



హైదరాబాద్ లో వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తెస్తున్నామన్న శ్రీధర్ బాబు

దీని కోసమే క్యూర్ యాక్ట్ 2026ను రూపొందించామని వెల్లడి

హైదరాబాద్ ప్రపంచ స్థాయి మెట్రో పాలిటన్ సిటీగా ఎదిగిందన్న మంత్రి

నిత్యం నిఘా, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో రాబోయే 20 నుంచి 30 ఏళ్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇందుకోసమే ప్రత్యేకంగా 'క్యూర్ (CURE) యాక్ట్– 2026' శాసనాన్ని రూపొందించినట్లు శాసన సభలో ఆయన వెల్లడించారు. నగర పరిపాలనను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, ప్రజా సమన్వయంతో ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా తీర్చిదిద్దడమే ఈ కొత్త చట్టం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' పాలసీ విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3...

2

ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా : మంత్రి పొంగులేటి

- బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో లక్షల ఎకరాల అక్రమాలు
- ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు
- దివాలా తీసిన విదేశీ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు
- బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ నేతలు పారిపోతున్నారు
- పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబమే బాగుపడింది
- అసెంబ్లీలో మంత్రి తీవ్ర ఆగ్రహం



నిత్యం నిఘా, హైదరాబాద్ : గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని లక్షలాది ఎకరాల భూములను ఆక్రమించిందని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం శాసనసభలో 22-ఏ నిషేధిత భూములపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల ఆస్తులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ రెవెన్యూ శాఖను తన వద్దే ఉంచుకుని భూ అక్రమాలకు పాల్పడ్డారని పొంగులేటి విమర్శించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత ప్రభుత్వం పాలన సాగించిందని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని, పోర్టల్‌పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి వేళల్లో రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు. పోర్టల్‌లోని సాంకేతిక లోపాల వల్ల లక్షలాది మంది రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందని, ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం, వారి బంధువులు మాత్రమే లబ్ధి పొందారని, సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. శాసనసభ సాక్షిగా తమ అక్రమాలు బయటపడుతుండటంతోనే గత పాలకులు చర్చ నుంచి పారిపోతున్నారని పొంగులేటి ఎద్దేవా చేశారు.

బర్తరఫ్ తర్వాత కీలక పరిణామం..

కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు

- మంత్రి పదవి కోల్పోయిన కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు
- వెంటనే రావాలంటూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దల నుంచి సందేశం
- కేబినెట్ స్థాయి పదవి ఇచ్చే యోచనలో అధిష్ఠానం ఉన్నట్లు సమాచారం
- సురేఖతో నేరుగా మాట్లాడిన తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్



2

బీఆర్ఎస్ నేతలపై కేసులు..

మరి మిస్ ఇంగ్లాండ్ వ్యవహారం ఏమైంది? - కేటీఆర్

- బీఆర్ఎస్ నేతలపై కేసులపై కేటీఆర్ స్పందన
- కేసులను కోర్టుల్లో ఎదుర్కొంటామని వెల్లడి
- మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై డీజీపీకి ప్రశ్న
- తెలంగాణ పోలీసులు నిందితులను కాపాడుతున్నారా? అని నిలదీత
- మిల్లా మ్యాగీ ఆరోపణలతో గతంలో రాజకీయ దుమారం



2

Nityam Nigha 13.09.26_Layout 1 9/13/2026 7:26 AM Page 2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

సహకారమే బ్రిక్స్ చోదకశక్తి
- ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి.. ఉమ్మడి లక్ష్యాల సాధనకు ఈ వేదిక నిదర్శనమని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ సందర్భంగా బ్రిక్స్ దేశాల అధినేతలు భారత్ మండపంలో ఏర్పాటు చేసిన వృక్షోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాతో పాటు ఇతర సభ్య, భాగస్వామ్య దేశాల నేతలు ప్రధాని మోదీతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం నేత లందరూ ఒకరి చేతులు మరొకరు పట్టుకుని సామూహిక చిత్రానికి (గ్రూప్ ఫొటో) పోజులిచ్చి, తమ ఐక్యతను చాటిచెప్పారు. సదస్సులో భాగంగా 'సమ్మిళిత ప్రపంచ పాలన, బహుపాక్షికతను బలోపేతం చేయడం' అనే అంశంపై చర్చలు జరిగాయి. ఈ భేటీలో "న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026"ను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. బ్రిక్స్ కూటమి ఏర్పాటై 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రెండు ప్రత్యేక పోస్టల్ స్టాంపులను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, "ఈ డిక్లరేషన్ మన ఉమ్మడి సంకల్పానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుంది. ఈ తీర్మా నాలను సత్ఫలితాలుగా మార్చడం మనందరి బాధ్యత" అని పేర్కొన్నారు.

2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే తెలంగాణ లక్ష్యం : శ్రీధర్ బాబు

మొదటిపేజీ తరువాయి.. ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చాటిచెప్పారు. చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు, మూసీ తీరం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్ ఎదిగిందని మంత్రి కొనియాడారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (GCC) ప్రధాన కేంద్రంగా మారిన హైదరాబాద్... రాష్ట్ర ఆర్థిక రంగానికి ప్రధాన గ్రోత్ ఇంజన్ అని గుర్తుచేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్‌డీపీ 10.7 శాతం వృద్ధితో రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని... ఇందులో క్యూర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలే సింహభాగం భాగస్వామ్యం వహిస్తున్నాయని ఆర్థిక గణాంకాలతో వివరించారు. ప్రస్తుతం నగరం ఔటర్ రింగ్ రోడ్డు వరకు వేగంగా విస్తరించిన నేపథ్యంలో మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఓఆర్ఆర్ పరిధికి ప్రత్యేక కార్యనిర్వాహక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. తాగునీటి సరఫరా, మురు గునీటి శుద్ధి, ప్రజా రవాణా, ట్రాఫిక్ నివారణ, చెత్త నిర్వహణ, వరదల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక శాఖలను ఒకే గొడుగు కిందకు తెచ్చి నగరపాలనను అంతర్జాతీయ ప్రమాణాలకు చేర్చడమే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతమయ్యాయి : కిషన్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి.. ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆది లాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమా నయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ (JUA) అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్లు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (IAF) వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

25,000 క్యాబ్ డ్రైవర్ల సమ్మె..
శంషాబాద్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో క్యాబ్ సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ) ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నుంచి దాదాపు 25,000 మంది క్యాబ్ డ్రైవర్లు సమ్మె చేపట్టారు. ఓలా, ఉబెర్, రాపిడో వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఎయిర్‌పోర్ట్ ట్రిప్పులను డ్రైవర్లు పూర్తిగా బహిష్కరించారు. ప్రభుత్వం 2022 డిసెంబర్ 9న జారీ చేసిన జీవో 46ను తక్షణమే అమలు చేయాలన్నది డ్రైవర్లు ప్రధాన డిమాండ్. ఈ జీవో ప్రకారం, ఎయిర్‌పోర్ట్ ప్రీపెయిడ్ సర్వీ సులకు కిలోమీటరుకు రూ. 21 చొప్పున ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం తమకు కిలోమీటరుకు కేవలం రూ. 12 నుంచి రూ. 15 మాత్రమే అందుతున్నాయని యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలా వుద్దీన్ ఆరోపించారు. అంశంపై ఆగస్టు 31న కార్మిక శాఖ జాయింట్ కమి షనర్ ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు, కంపెనీల యాజమాన్యాలతో కీలక సమావేశం జరిగింది. జీవో నిబంధనల ప్రకారం ఛార్జీలు చెల్లించాలని అధికారులు ఆదేశించినప్పటికీ, సదరు కంపెనీలు వాటిని బేఖాతరు చేశాయని యూనియన్ ఆవేదన వ్యక్తం చేసింది. "మేము ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు కోరడం లేదు. మాకు దక్కాల్సిన చట్టబద్ధమైన ఛార్జీలతో పాటు వృత్తిపరమైన గౌరవం, సమానత్వం కావాలి" అని అన్నారు. ఈ సమస్యలపై సమగ్రంగా చర్చించి, లిఖితపూర్వక హామీ ఇచ్చేందుకు ప్రభుత్వం వెంటనే సంబంధిత భాగస్వామ్య పక్షాలతో సమావేశం ఏర్పాటు చేయాలని యూనియన్ విజ్ఞప్తి చేసింది.

వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ : సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి.. ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగా ణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికా రులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. "స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... "మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిస రాలను సిద్ధం చేయాలి" అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. "హైద రాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్ నేతలపై కేసులు..
మరి మిస్ ఇంగ్లాండ్ వ్యవహారం ఏమైంది? - కేటీఆర్

మొదటిపేజీ తరువాయి.. అసెంబ్లీ ప్రాంగణంలో ఇటీవల జరిగిన గందరగోళం నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మె ల్సీలపై లైంగిక వేధింపుల కేసులు నమోదు చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ కేసులను న్యాయ స్థానాల్లో ఎదుర్కొంటామని చెప్పారు. అయితే హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ చేసిన ఆరోపణలపై ఏం చర్యలు తీసు కున్నారని రాష్ట్ర డీజీపీని ప్రశ్నించారు. ''ఈ చెత్త కేసును మేం కోర్టుల్లో ఎదుర్కొంటాం. కానీ హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల సమయంలో మిస్ ఇంగ్లాండ్‌తో అభ్యంతర కరంగా ప్రవర్తించిన కాంగ్రెస్ నాయకులపై ఆమె చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు ఏమయ్యా యి?'' అని కేటీఆర్ ప్రశ్నించారు. నిందితులను తెలంగాణ పోలీసులు ఇంకా కాపాడుతున్నారా? దీనిపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వద్ద సమాధానం ఉందా? అని నిలదీశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. అసెంబ్లీ గేటు ముందు జరిగిన గందరగోళం నేపథ్యంలో ముఖ్యమంత్రి తన పోలీసులతో బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసులు నమోదు చేయించడం చట్టాన్ని దుర్వినియోగం చేయ డమేనని కేటీఆర్ ఆరోపించారు.

బర్తరఫ్ తర్వాత కీలక పరిణామం..
కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు

మొదటిపేజీ తరువాయి.. మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయిన కొండా సురేఖ వ్యవహారంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. ఆమెకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఢిల్లీకి రావాల్సిందిగా పిలుపు అందింది. వెంటనే బయలుదేరి రావాలని పార్టీ పెద్దల నుంచి ఆమెకు సందేశం అందినట్లు తెలుస్తోంది. మంత్రివర్గం నుంచి తొలగించిన మరుసటి రోజే హైకమాండ్ రంగంలోకి దిగడం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తి రేపుతోంది. నిన్న తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, కొండా సురేఖతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలని, అధిష్ఠానం అండగా ఉంటుందని ఆమెకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ సంభాషణ జరిగిన కొద్ది గంటల్లోనే ఢిల్లీ నుంచి పిలుపు రావడం గమనార్హం. మంత్రి పదవి కోల్పోయి అసంతృప్తితో ఉన్న కొండా సురేఖను బుజ్జగించేందుకే అధిష్ఠానం ఈ చర్యలు చేప ట్టినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆమెకు కేబినెట్ స్థాయి పదవిని అప్పగించే యోచనలో కాంగ్రెస్ పెద్దలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అధిష్ఠానం పిలుపు మేరకు కొండా సురేఖ ఢిల్లీ పర్యటన తర్వాత ఈ వ్యవహారంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

రెండు ఆహార ఉత్పత్తులపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కొరడా..

మొదటిపేజీ తరువాయి..
రెండు ప్రముఖ కంపెనీలకు చెందిన ఆహార ఉత్పత్తులు వినియోగదారుల ఆరోగ్యానికి సురక్షితం కావని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎ స్ఎస్ఏఐ) శనివారం వెల్లడించింది. ప్రయో గశాల పరీక్షల్లో ఈ ఉత్పత్తులు నాణ్యతా ప్రమాణాలను అందుకోవడంలో విఫలమ వడంతో, వాటిని తక్షణమే మార్కెట్ నుంచి వెనక్కి తీసుకోవాలని (రీకాల్) సదరు కంపెనీలను ఆదేశించింది. నీలగిరి ఆయిల్ అండ్ అల్లైడ్ ఇండస్ట్రీస్‌కు చెందిన 'షాలిమార్స్ చెఫ్ – కొరియాండర్ పౌడర్', ఆక్వాగ్రి ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 'క్యారెజీనన్' ఉత్పత్తులను నిలిపివే యాలని స్పష్టం చేసింది. నీల్‌గిరి ఆయిల్ కంపెనీ ప్రాంగణం నుంచి సేకరించిన 'షాలిమార్స్ చెఫ్' ధనియాల పొడి నమూ నాలను పరీక్షించగా, అందులో అనుమ తించిన పరిమితికి మించి పురుగుమందుల అవశేషాలు ఉన్నట్లు తేలింది. దీంతో ఈ ఉత్పత్తి ఆరోగ్యానికి సురక్షితం కాదని అధి కారులు వర్గీకరించారు. అయితే, అధి కారుల నిర్ణయంపై సదరు కంపెనీ అప్పీల్ చేయడంతో మరోసారి పరీక్షలు నిర్వ హించగా, అప్పుడు కూడా ఫలితాల్లో ఎటువంటి మార్పు రాలేదు. దీంతో ఈ ఉత్పత్తి ప్రమాదకరమైనదేనని ఎఫ్ఎ స్ఎస్ఏఐ పునరుద్ఘాటించింది. మరో కేసులో, ఆక్వాగ్రి ప్రాసెసింగ్ సంస్థ నుంచి సేకరించిన 'క్యారెజీనన్' (ఎర్రసముద్రం నుంచి సేకరించిన సీవీడ్ ఉత్పత్తి)' నమూనాలో అనుమతించిన స్థాయి కంటే ఎక్కువగా కాడ్మియం ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈ కంపెనీ కూడా అప్పీల్ చేయగా, రిఫరల్ ల్యాబొరేటరీలో జరిపిన రీ-టెస్టింగ్‌లోనూ సదరు ఉత్పత్తి సురక్షితం కాదని తేలింది. ఈ రెండు ఉత్పత్తులు ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తు న్నాయని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్ రీకాల్ ప్రొసీజర్) రెగ్యులేషన్స్, 2017 ప్రకారం, ఈ ఉత్పత్తులను మార్కెట్ నుంచి తక్షణమే ఉపసంహరించుకోవాలని సంబంధిత కంపెనీలను ఆదేశించింది.

ఎల్ఓసీ వద్ద ఉద్రిక్తతలు.. ఫేక్ న్యూస్‌ను ఖండించిన ఇండియన్ ఆర్మీ

- **ఎల్ఓసీ వద్ద ఉగ్ర కార్యకలాపాలు పెరిగాయన్న వార్తలను ఖండించిన ఆర్మీ**
- **కుప్వారా, బారాముల్లాలో ఇళ్లు ఖాళీ చేయిస్తున్నారన్నది తప్పుడు ప్రచారం**
- **సోషల్ మీడియాలో పాకిస్థాన్ ఆధారిత ఖాతా దుష్ప్రచారం చేస్తోందని వెల్లడి**
- **సైన్యం మోహరింపు పెరిగిందన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టీకరణ**
- **సమాచారాన్ని నిర్ధారించు కున్నాకే షేర్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి**

నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ :
జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) సమీపంలో ఉగ్రవాద కార్యక లాపాలు పెరిగాయని, అక్కడి ప్రజలను ఇళ్లు ఖాళీ చేయమని సైన్యం ఆదేశించిందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని భారత సైన్యం తీవ్రంగా ఖండించింది. ఇదంతా నిరాధారమైన, తప్పుడు ప్రచారమని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇండియన్ ఆర్మీ అధికారిక ఫ్యాక్ట్-చెక్ విభాగం నేడు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఓ ప్రకటన విడుదల చేసింది. ఉత్తర కశ్మీర్‌లోని కుప్వారా, బారాముల్లా జిల్లాల్లోని ప్రధాన సైనిక స్థావరాల సమీపంలో నివసించే వారిని ఇళ్లు ఖాళీ చేయాల్సిందిగా ఆర్మీ కోరినట్టుగా కొన్ని నివేదికలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ వార్తలకు, నియంత్రణ రేఖ వద్ద ఉగ్రవాదుల కదలికలు పెరిగాయనడానికి సంబంధం ఉందంటూ `@KashmirIntel ` అనే ఎక్స్ ఖాతా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోందని ఆర్మీ తెలిపింది. ఈ ఖాతా పాకిస్థాన్ ఆధారిత ప్రచార ఖాతా అని, ప్రజలను తప్పుదోవ పట్టించడమే దీని లక్ష్యమని పేర్కొంది. "నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగా యనడం, అసాధారణ స్థాయిలో సైన్యం మోహరింపు జరుగుతోందనడం పూర్తిగా అవాస్తవం" అని ఆర్మీ అధికారులు స్పష్టం



చేశారు. ఈ ప్రచార ఖాతా ఐరోపా కేంద్రంగా పనిచేస్తూ, కశ్మీర్‌లోని పరిస్థితులపై తప్పుడు కథనాలను సృష్టించడానికి ప్రయత్నిస్తోందని వివరించారు. గతంలోనూ పలుమార్లు ఈ ఖాతా నుంచి ఇలాంటి నకిలీ వార్తలు వ్యాప్తి అయ్యాయని గుర్తుచేశారు. నిర్ధారణ లేని ఉగ్రవాద వాదనలు, ఆధారాల్లేని సైనిక మోహరింపు కథనాలు, ఊహాజనిత సంబం ధాలను కలిపి తప్పుడు సమాచారాన్ని సృష్టిస్తున్నారని ఆర్మీ తన పోస్టులో పేర్కొంది. "ఏదైనా సమాచారాన్ని ఇతరులకు చేరవేసే ముందు దానిని ధ్రువీకరించుకోవాలి" అని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఇటువంటి వదం తులను నమ్మవద్దని, వాటిని వ్యాప్తి చేయ వద్దని సైన్యం ప్రజలను కోరింది.

Nityam Nigha 13.09.26_Layout 1 9/13/2026 7:26 AM Page 3

ఆకట్టుకున్న మట్టి వినాయకుల పంపిణీ!

- మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణకు పిలుపు

- దేవుడిపై భక్తితో పాటు ప్రకృతిపై బాధ్యత ఉండాలి: రావు పద్మ



హన్మకొండ, సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని చారిత్రాత్మక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణం పద్ద మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమం ఆకట్టుకుంది. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉంటూ మట్టి వినాయకులనే పూజించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు రావు పద్మ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రావు పద్మ నిర్వాహకులతో కలిసి ప్రజలు, విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని మట్టి విగ్రహాలను ఉత్సాహంగా స్వీకరించారు.

దేవుడిపై భక్తి.. ప్రకృతిపై బాధ్యత

ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాల్లో ప్రకృతి పూజకు విశిష్ట స్థానం ఉందన్నారు. దేవుడిపై భక్తి ఎంత ముఖ్యమో, జీవనాధారమైన ప్రకృతిని పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని పేర్కొన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, పర్యావరణానికి హాని కలిగించే విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణహితంగా వినాయక చవితిని నిర్వహించడం ద్వారా రాబోయే తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. “మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం” అనే సందేశంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేపట్టిన నిర్వాహకులను పలువురు అభినందించారు.

గర్భిణీలకు రోటరీ క్లబ్ పోషకాహార కిట్ల పంపిణీ

65 మంది గర్భిణీలకు సుమారు రూ.15 వేల విలువైన ఆహార పదార్థాల పంపిణీ

తల్లి ఆరోగ్యంతోనే శిశువు ఆరోగ్యకర ఎదుగుదల: వైద్యులు





వరంగల్, సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): గర్భిణీ మహిళలకు పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో వరంగల్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రంగశాయిపేట ప్రభుత్వ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోషకాహార కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అఖిల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 65 మంది గర్భిణీ మహిళలకు సుమారు రూ.15 వేల విలువైన పోషకాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ కార్యక్రమ అధికారి (మాతృ ఆరోగ్యం, పోషకాహారం) డాక్టర్ సజిదా హాజరై గర్భిణీలకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సజిదా మాట్లాడుతూ గర్భిణీ మహిళలకు పోషకాహారం అందించడం అభినందనీయమన్నారు. తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, పప్పుధాన్యాలు, బీన్స్, తక్కువ కొవ్వు కలిగిన ప్రోటీన్ ఆహారం, పండ్లు, పాల ఉత్పత్తులు, ఆరోగ్యకరమైన కొవ్వులతో కూడిన సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. వైద్యుల సూచన మేరకు నడక వంటి తేలికపాటి వ్యాయామాలు చేయాలని సూచించారు.

తల్లి పోషకాహారమే శిశువు ఆరోగ్యానికి పునాది

రోటరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ హరి రామాదేవి మాట్లాడుతూ పోషకాహార కిట్లు గర్భిణీ మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు గర్భంలోని శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడతాయని తెలిపారు. గర్భధారణ సమయంలో తల్లి ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ అధ్యక్షుడు అనంతుల కుమారస్వామి మాట్లాడుతూ పేదలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం రోటరీ క్లబ్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఆరోగ్యం, విద్య, సామాజిక అభివృద్ధి రంగాల్లో తమ వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. మాజీ చైర్‌పర్సన్, బాలల సంక్షేమ కమిటీ సభ్యుడు మండల పరశురాములు మాట్లాడుతూ సమాజంలోని అవసరమైన వారికి అండగా నిలిచేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. పేదలు, బలహీన వర్గాల ఆరోగ్యం, విద్య, సమగ్ర అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ అనిత, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు, రోటరీ సభ్యులు చందా రఘువీర్, చెరుకు రాజేందర్ రెడ్డి, రమేష్ బాబు, శ్రీకాంత్, ధర్మేంద్ర, సదానందం యాదవ్, సమ్మయ్య యాదవ్, మురళీధర్ చారి, ముస్కు భాస్కర్ రెడ్డి, రాజ్యలక్ష్మి , రమేష్ తదితరులు పాల్గొన్నారు. పలువురు గర్భిణీ మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

- **నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**
- **నిర్వాహకులు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి: ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**



భూపాలపల్లి, సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన, ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, ప్రజలు పోలీస్ శాఖ సూచించిన నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ సూచించారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ముందస్తు అనుమతులు తీసుకోవాలని, ప్రజా శాంతిభద్రతలు, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.

*** విగ్రహ ప్రతిష్ఠాపనకు ముందస్తు అనుమతి తప్పనిసరి**

గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపనకు పోలీస్ అనుమతి కోసం పూర్తిగా నింపిన సమాచార పత్రాన్ని తెలంగాణ పోలీస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో సమర్పించాలని తెలిపారు. ప్రతి స్థాపన స్థలం, తేదీతో పాటు నిమజ్జన ప్రదేశం వివరాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. విగ్రహం ఏర్పాటు చేసే స్థల యజమాని నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా పొందాలని, ప్రభుత్వ స్థలమైనా, ప్రైవేట్ స్థలమైనా నిబంధన వర్తిస్తుందని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగని, ప్రజా శాంతిభద్రతలకు ముప్పు లేని ప్రదేశాల్లోనే విగ్రహాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వివాదాస్పద ప్రాంతాల్లో విగ్రహాల ప్రతిష్ఠాపనకు అనుమతులు ఇవ్వబడవని పేర్కొన్నారు.

*** అక్రమ విద్యుత్ కనెక్షన్లు వద్దు**

గణేష్ మండపాల్లో అనధికారిక విద్యుత్ కనెక్షన్లను వినియోగించరాదని ఎస్పీ సూచించారు. విద్యుత్ సరఫరా కోసం సంబంధిత విద్యుత్ సంస్థ నుంచి అధీకృత కనెక్షన్ పొందాలని, అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని తెలిపారు.

*** రాత్రి 10 తర్వాత లౌడ్‌స్పీకర్లకు అనుమతి లేదు**

లౌడ్‌స్పీకర్ల వినియోగాన్ని రెండు బాక్స్ తరహా స్పీకర్లకు మాత్రమే పరిమితం చేయాలని, డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్లు, బహిరంగ ప్రకటన వ్యవస్థలను వినియోగించరాదని తెలిపారు. పోలీస్ అనుమతిలో పేర్కొన్న నిబంధనలు, నిమజ్జన ఊరేగింపు మార్గం, సమయాలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

*** ప్రతి మండపం వద్ద నిఘా**

ప్రతి గణేష్ మండపం వద్ద నిఘా కెమెరాలు, వీడియో కెమెరాలు ఏర్పాటు చేసి అవి నిరంతరం పనిచేసేలా చూడాలని ఎస్పీ సూచించారు. ఉత్సవాల సందర్భంగా అసభ్యకర నృత్యాలు, అభ్యంతరకర పాటలు, కార్యక్రమాలకు తావివ్వరాదని, భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించాలని తెలిపారు.

*** సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి**

ప్రతి గణేష్ మండపం వద్ద సైబర్ నేరాలపై అవగాహన కల్పించే పోస్టర్లను ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ సూచించింది. ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ చెల్లింపుల భద్రత, రహస్య సంకేతాలు, వ్యక్తిగత గుర్తింపు సంఖ్యలు, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోకూడదనే అంశాలతో పాటు అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరింది.

*** పోలీసులకు సహకరించాలి**

గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా, సామరస్యపూర్వకంగా నిర్వహించేందుకు ఉత్సవ నిర్వాహకులు, స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు, శాంతి కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ కోరారు. ప్రజా శాంతిభద్రతలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, భక్తుల భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పోలీస్ శాఖ జారీ చేసిన నిబంధనలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై క్రిమినల్ కేసులు

- **హనుమకొండలో కాజీపేట ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు**
- **మోడిఫైడ్ సైలెన్సర్లు, మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలకు హెచ్చరిక**



హనుమకొండ, సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ నగరంలో పెరుగుతున్న రహదారి ప్రమాదాలను నియంత్రించడంతో పాటు మైనర్ డ్రైవింగ్‌కు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా కాజీపేట ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. శనివారం హనుమకొండలోని అండర్ రోడ్డు పరిసరాల్లో కాజీపేట ట్రాఫిక్ సీఐ వెంకన్న నేతృత్వంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలు నడుపుతున్న పలువురు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా అధిక శబ్దాలు వచ్చే మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన ద్విచక్ర వాహనదారులపైనా చర్యలు చేపట్టి కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

★ తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన సీఐ వెంకన్న, ట్రాఫిక్ సిబ్బందితో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రమాదాలు, ప్రమాదాల కారణంగా కుటుంబాలు ఎదుర్కొనే నష్టాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ వెంకన్న మాట్లాడుతూ గతంలో మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన తొమ్మిది మంది మైనర్లకు న్యాయస్థానం ఒక రోజు బాలల సంరక్షణ గృహంలో శిక్ష విధించిందని తెలిపారు. సంబంధిత వాహనాల యజమానులకు కూడా కోర్టు జరిమానాలు విధించిందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రతి తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

వాహనాలు ఇస్తే కేసులు తప్పవు

ఇకపై మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారికి వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులు లేదా వాహన యజమానులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. నిబంధనల ప్రకారం జైలు శిక్ష లేదా భారీ జరిమానా పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అలాగే అధిక శబ్దాలు చేసే మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే వాహనాలను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

★ భవిష్యత్తుపైనా ప్రభావం

మైనర్లపై కేసులు నమోదైతే వారి భవిష్యత్తు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పోలీసులు తల్లిదండ్రులకు వివరించారు. పిల్లలపై ప్రేమతో వాహనాలు ఇచ్చి వారి భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టవద్దని సూచించారు. ప్రజల రక్షణే లక్ష్యంగా ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సీఐ వెంకన్న తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డికి మట్టి వినాయకుడి అందజేత

- **పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతుల వినియోగాన్ని ప్రోత్సహించాలి**
- **రసాయన విగ్రహాలకు బదులుగా పర్యావరణహిత మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని పిలుపు**



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుల వినియోగాన్ని ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మట్టి వినాయకుడిని అందజేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో కలిసి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్యమంత్రికి మట్టి గణపతి విగ్రహాన్ని అందించారు. ఈ సందర్భంగా మట్టి వినాయకుల వినియోగంపై ప్రజల్లో పర్యావరణ అవగాహన కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా పర్యావరణహితమైన మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని ప్రజలకు సూచించారు. మట్టి వినాయకుల వినియోగం ద్వారా జల, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రకృతి పరిరక్షణకు తోడ్పడవచ్చని తెలిపారు. భక్తిశ్రద్ధలతో వినాయక చవితిని జరుపుకుంటూనే పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ, పండుగలను పర్యావరణహితంగా నిర్వహించేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 13.09.26_Layout 1 9/13/2026 7:26 AM Page 4

భద్రకాళి బండ్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- నాణ్యతలో రాజీ వద్దు.. నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి - కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



హనుమకొండ, సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): చారిత్రాత్మక హనుమకొండ నగరంలోని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన భద్రకాళి బండ్ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, అత్యంత నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం భద్రకాళి బండ్ పరిసర ప్రాంతాలను ఆమె క్షేత్రస్థాయిలో సందర్శించి కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అధికారులతో కలిసి బండ్ వెంట నడుస్తూ పనుల పురోగతిని సమీక్షించారు.

*** నాణ్యతలో రాజీ వద్దు**

భద్రకాళి బండ్‌ను పర్యాటకులను ఆకట్టుకునేలా సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడరాదని స్పష్టం చేశారు. బండ్‌పై చేపడుతున్న గ్రానైట్ పనులు, పర్యాటకులు నడిచేందుకు ఏర్పాటు చేస్తున్న నడక మార్గాలు, కాలువల వ్యవస్థ, రాత్రివేళల్లో ఆకర్షణీయంగా కనిపించేలా ఏర్పాటు చేస్తున్న ఆధునిక విద్యుత్ దీపాల పనులను ఆమె పరిశీలించారు.

*** పచ్చదనానికి ప్రాధాన్యం**

బండ్ పరిసరాల్లో ఖాళీగా ఉన్న ప్రతి ప్రదేశాన్ని సద్వినియోగం చేసుకుని విస్తృతంగా మొక్కలు నాటాలని కలెక్టర్ సూచించారు. పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పచ్చదనం, భూసుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రజలు మరియు పర్యాటకులకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ పరిశీలనలో గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవలకు అరుదైన గౌరవం..
సదానిరంజన్ సిద్ధాంతికి స్వర్ణ నంది

- **సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాల్లో సేవలకు గుర్తింపు**
- **గురువందనం కార్యక్రమంలో ఘనంగా సత్కారం**



హనుమకొండ/ ఎల్కతుర్తి, సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ బొగ్గుల కుంటలోని సారస్వత పరిషత్‌లో కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువందనం, ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళలు, సాహిత్యం, సంస్కృతి, సేవా కార్యక్రమాల ద్వారా 26 ఏళ్లుగా కళానిలయం సంస్థ అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూర్వ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి హాజరై పలువురు ప్రముఖులను సత్కరించారు. ఉపాధ్యాయులు, కళాకారులు, సాంస్కృతిక రంగ ప్రముఖులను గౌరవిస్తూ గురువందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చక పురోహితులు, వాస్తు–జ్యోతిష్య పండితులు శివశ్రీ సదానిరంజన్ సిద్ధాంతిని సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాల్లో అందిస్తున్న సేవలను గుర్తిస్తూ స్వర్ణ నంది పురస్కారంతో ఘనంగా సత్కరించారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఆధ్యాత్మిక, ధార్మిక, వాస్తు, జ్యోతిష్య రంగాల్లో సేవలందిస్తూ ప్రజలకు మార్గదర్శకత్వం చేస్తున్న సదానిరంజన్ సిద్ధాంతికి స్వర్ణ నంది పురస్కారం లభించడం పట్ల పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ, తనకు లభించిన ఈ గౌరవం మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. సమాజానికి తన వంతు సేవలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని తెలిపారు. తనను స్వర్ణ నంది పురస్కారంతో సత్కరించిన కళానిలయం సాంస్కృతిక సంఘ సంస్థ నిర్వాహకులు, ఏ. సురేందర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ 26 ఏళ్లుగా నిర్వహిస్తున్న సాంస్కృతిక, సాహిత్య, సేవా కార్యక్రమాలను వక్తలు ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమంలో సాంస్కృతిక, సాహిత్య, ఆధ్యాత్మిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు, కళానిలయం సభ్యులు, ఉపాధ్యాయులు, అభిమానులు పాల్గొన్నారు.

మంథనిలో రైతు గోస.. బీజేపీ భరోసా

- **24 గంటల విద్యుత్ సరఫరా హామీ అమలు చేయాలని డిమాండ్**
- **విద్యుత్ శాఖ డీఈకి వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు, రైతులు**



పెద్దపల్లి జిల్లా/మంథని, సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలనే డిమాండ్‌తో బీజేపీ ఆధ్వర్యంలో మంథనిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన ‘రైతు గోస.. బీజేపీ భరోసా’ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద బీజేపీ నాయకులు, రైతులతో కలిసి మహాధర్నా నిర్వహించారు. అనంతరం బీజేపీ నాయకులు, రైతులు ఎమ్మెల్యే శిబిర కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని నినాదాలు చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

*** హామీ మేరకు 24 గంటల కరెంటు ఇవ్వాలి: సునీల్‌రెడ్డి**

ఈ సందర్భంగా బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్నప్పటికీ రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం తక్కువ సమయం మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా రైతులు సాగు విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోనూ రైతులు సాగునీటి కోసం ఆందోళన చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేసి రైతులకు నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే ఎమ్మెల్యే శిబిర కార్యాలయం ఎదుట మరింత పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

*** డీఈకి వినతిపత్రం**

ధర్నా అనంతరం బీజేపీ నాయకులు, రైతులు మంథని విద్యుత్ శాఖ డీఈని కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కరించి, నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండపాక సత్యప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము, నియోజకవర్గ సహ కన్వీనర్ నంపెల్లి రమేష్, మండల అధ్యక్షులు విరబోయిన రాజేందర్, సబ్బాని సంతోష్, కొయ్యడ సతీష్, పగే రంజిత్, కొండ్రు లక్ష్మణ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఎల్కా సదానందం, సీనియర్ నాయకులు రాపర్తి సంతోష్, మట్ట శంకర్, దుర్గం తిరుపతి, మల్లారపు అరుణ్, చిలువేరు సతీష్, మల్లారెడ్డి, కోడారి దేవేందర్, ఎలావేన సమ్మయ్య, సేనవేన సునీల్, పత్తి మహేందర్‌రెడ్డి, విశ్వతేజ, సామల అశోక్, ఎడ్ల సాగర్, భానుప్రకాశ్, తొట్ల రాజు, శంకర్, కసిపేట సాంబయ్య, మణుగు కొమురయ్య, విష్ణు, ప్రకాష్, గురువేష్, హేమంత్, సాయి, స్వరూప, రాజశేఖర్, ఆనంద్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ప్రాణాపాయ స్థితిలో కాంగ్రెస్ కార్యకర్త..
ఆదుకోవాలంటూ వేడుకోలు

- **పార్టీ కోసం ఏళ్ల తరబడి సేవ చేసిన పుల్లూరి దిలీప్ గౌడ్‌కు తీవ్ర అనారోగ్యం**
- **వైద్యానికి లక్షల్లో ఖర్చు.. ఆర్థిక సాయం కోసం కుటుంబ సభ్యుల ఎదురుచూపు**





వరంగల్/ పర్వతగిరి, సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన ఓ కాంగ్రెస్ కార్యకర్త నేడు తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమై ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నాడు. పర్వతగిరి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త పుల్లూరి దిలీప్ గౌడ్ (తండ్రి: ఏకాంతం గౌడ్) కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రస్తుతం వైద్య చికిత్స, మందుల ఖర్చులు భరించేందుకు కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. దిలీప్ గౌడ్ గతంలో వర్ధన్నపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, పర్వతగిరి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారని కాంగ్రెస్ శ్రేణులు తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, కార్యకర్తలకు అండగా నిలుస్తూ కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలు పనిచేశారని పేర్కొన్నారు.

*** నేడు ఇతరుల సాయం కోసం ఎదురుచూపు**

గతంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న దిలీప్ గౌడ్ ప్రస్తుతం అనారోగ్యం కారణంగా మంచానికే పరిమితమయ్యారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య చికిత్సతో పాటు మందుల కోసం కూడా గణనీయమైన ఖర్చు అవుతుండటంతో కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ‘‘పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా సేవ చేసిన మన కార్యకర్త నేడు కష్టాల్లో ఉన్నాడు. రాజకీయ విభేదాలు, పట్టింపులను పక్కన పెట్టి మానవత్వంతో ఆయనకు అండగా నిలవాలి’’ అని కాంగ్రెస్ శ్రేణులు విజ్ఞప్తి చేశాయి.

*** చేయూతనివ్వాలని విజ్ఞప్తి**

దిలీప్ గౌడ్ వైద్య చికిత్సకు తమకు తోచిన మేరకు చిన్నదైనా, పెద్దదైనా ఆర్థిక సహాయం అందించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. కష్టాల్లో ఉన్న కార్యకర్తకు అండగా నిలిచి వైద్య ఖర్చులకు సహకరించాలని పిలుపునిచ్చారు. సహాయం కోసం సంప్రదించాల్సిన వ్యక్తి: కందికట్ల అనిల్ – 9652664737

ఫోన్‌పే ద్వారా సహాయం అందించవచ్చని తెలిపారు. ‘‘కష్టాల్లో ఉన్న కార్యకర్తకు చేయూతనిద్దాం.. వైద్య చికిత్సకు అండగా నిలుద్దాం’’ అని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు.

అండర్‌పాస్ కోసం అన్నదాతల ఆందోళన

- **ఎన్‌హెచ్–563పై రైతుల ధర్నా.. నినాదాలతో హోరెత్తిన ప్రాంతం**
- **వ్యవసాయ భూములు, బావులు, పశువుల వద్దకు వెళ్లేందుకు ఇబ్బందులు.. అండర్‌పాస్ నిర్మించాలని డిమాండ్**



హనుమకొండ/ ఎల్కతుర్తి, సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కోతులనడుమ గ్రామం వద్ద ఎన్‌హెచ్–563 రహదారి నిర్మాణ పనులు పూర్తయిన నేపథ్యంలో అండర్‌పాస్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ రైతులు, గ్రామస్తులు శనివారం రోడ్డుపై ధర్నా నిర్వహించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ సమస్యను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రహదారి నిర్మాణం కారణంగా గ్రామం నుంచి రైతులు తమ వ్యవసాయ భూములు, బావులు, పశువుల వద్దకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. రహదారిని దాటి వెళ్లే అవకాశం లేకపోవడంతో రెండు నుంచి మూడు కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గ్రామ సమీపంలో తప్పనిసరిగా అండర్‌పాస్ నిర్మించాలని డిమాండ్ చేశారు.

ధర్నాలో సొసైటీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు శీపతి రవీంద్రగౌడ్‌తో పాటు పలువురు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అండర్‌పాస్ మంజూరు చేయకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. సమాచారం అందుకున్న ఎల్కతుర్తి సీఐ శ్రీను ఆధ్వర్యంలో ఎస్ఐ నర్సింహారావుతో పాటు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. సుమారు రెండు గంటల పాటు ధర్నా కొనసాగడంతో ఎన్‌హెచ్–563పై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. రైతుల సమస్యను అధికారులు, జాతీయ రహదారుల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, గ్రామస్తులకు ఉపయోగపడేలా అండర్‌పాస్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

Nityam Nigha 13.09.26_Layout 1 9/13/2026 7:26 AM Page 5

వర్ధన్నపేటలో బెల్ట్ షాపుల బరితెగింపు?

- గ్రామాల ప్రధాన రహదారులపైనే విచ్చల విడిగా మద్యం విక్రయాలా?
- క్వార్టర్ బాటిల్‌పై రూ.30–40 అదనపు వసూళ్లంటూ ఆరోపణలు



వరంగల్/ వర్ధన్నపేట, సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట మండల పరిధిలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపుల వ్యవహారం జోరుగా సాగుతోందన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. గ్రామాల ప్రధాన రహదారులు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లోనే మద్యం విక్రయాలు జరుగుతున్నాయని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయా? అన్న అనుమానాలను వారు వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మద్యం విక్రయ కేంద్రాల వద్ద తరచూ గొడవలు, అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. మరోవైపు క్వార్టర్ బాటిల్‌పై రూ.30 నుంచి రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

*** అబ్కారీ శాఖ నిఘా ఎక్కడ?**

బెల్ట్ షాపులపై నిఘా పెట్టి, నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరిగితే చర్యలు తీసుకోవాల్సిన అబ్కారీ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బహిరంగంగా విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నప్పటికీ అధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

*** చర్యలు ఎందుకు లేవు?**

అక్రమ మద్యం విక్రయాలపై ఫిర్యాదులు వస్తే అధికారులు తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే వర్ధన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో అబ్కారీ శాఖ స్పష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ వ్యవహారం కొనసాగుతోందా? బెల్ట్ షాపుల వెనుక ఎవరైనా ప్రభావశీలుల అండ ఉందా? అన్న అనుమానాలు కూడా స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారుల నుంచి స్పష్టమైన వివరణ రావాల్సి ఉంది.

*** ఉన్నతాధికారులు స్పందించాలి**

వర్ధన్నపేట మండలంలోని గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో సంబంధిత అబ్కారీ అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణపైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ పదవికి దరఖాస్తుల ఆహ్వానం

- ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు.. సెప్టెంబర్ 16లోగా సమర్పణ
- ఆదివాసీ హక్కుల కోసం, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పనిచేసే వారికి అవకాశం

హనుమకొండ, సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ పదవికి ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రదేశ్ ఆదివాసీ కాంగ్రెస్ సమన్వయకర్త పూనమ్ చంద్రకళ దొర సూచనల మేరకు ఈ నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. చైర్మన్ పదవికి పోటీ చేయాలనుకునే ఆసక్తి ఉన్న అభ్యర్థులు నిర్దేశిత దరఖాస్తు ఫారాన్ని పూర్తిగా నింపి ఈ నెల 16వ తేదీలోగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణతో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలనే ఆసక్తి ఉన్న నాయకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జిల్లాలోని ఆదివాసీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అర్హత కలిగిన ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నియామక ప్రక్రియలో పాల్గొనాలని ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

డబుల్ రోడ్డు చేస్తారా.. ఇసుక రవాణా మానేస్తారా?

- కాటాపూర్ సింగిల్ రోడ్డుపై భారీ ఇసుక వాహనాల రాకపోకలు
- రెండు వాహనాలు ఎదురెదురైతే తప్పుకునే దారిలేదు.. అత్యవసర వాహనాలకూ ఇబ్బందే

ములుగు జిల్లా/ తాడ్వాయి, సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండలం కాటాపూర్‌కు వెళ్లాలంటే సింగిల్ రోడ్డు.. ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే పక్కకు తప్పుకోవడం కష్టమే.. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌కు సైతం దారి ఇవ్వలేని పరిస్థితి.. దీనికి తోడు అదే రహదారిపై భారీ ఇసుక వాహనాల రాకపోకలు. ఇదీ తాడ్వాయి మండల పరిధిలోని కాటాపూర్ గ్రామ ప్రజల దుస్థితి. మండలంలోని అతిపెద్ద గ్రామపంచాయతీల్లో ఒకటైన కాటాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి ఇప్పటికీ సింగిల్ రోడ్డుగానే ఉండటంతో నిత్యం ప్రమాద భయం వెంటాడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రాకపోకలు పెరుగుతున్న నేపథ్యంలో రహదారిని వెంటనే డబుల్ రోడ్డుగా విస్తరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

*** సింగిల్ రోడ్డుపై ఇసుక వాహనాల జోరు**

ఇప్పటికే ఇరుకైన రహదారిపై ప్రయాణం కష్టంగా ఉండగా, ప్రస్తుతం భారీ ఇసుక వాహనాలు కూడా ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఓవర్‌లోడ్‌తో భారీ వాహనాలు తిరుగుతుంటే సింగిల్ రోడ్డు పరిస్థితి ఏమవుతుందని ప్రశ్నిస్తున్నారు. ‘‘ఎమర్జెన్సీ వస్తే కనీసం 108 వాహనానికి కూడా సైడ్ ఇవ్వలేని పరిస్థితి ఉంది. ప్రమాదం జరిగిన తర్వాత అధికారులు స్పందిస్తే ప్రయోజనం ఏమిటి?’’ అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డబుల్ రోడ్డుకు అప్పట్లో మంజూరు.. మరి ఇప్పుడు ఎందుకు కాదు? గత ప్రభుత్వ హయాంలో తాడ్వాయి వరకు డబుల్ రోడ్డు మంజూరైందని స్థానికులు చెబుతున్నారు. అయితే అటవీ ప్రాంతం దెబ్బతింటుందనే కారణంతో రహదారి విస్తరణకు అటవీ శాఖ నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని పేర్కొంటున్నారు. దీంతో రహదారి నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ వెనక్కి తగ్గి సింగిల్ రోడ్డుతోనే పనులు ముగించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే అప్పట్లో డబుల్ రోడ్డుకు అనుమతులు లేవని చెప్పిన అటవీశాఖ అధికారులు.. ఇప్పుడు అదే సింగిల్ రోడ్డుపై భారీ స్థాయిలో ఇసుక వాహనాల రాకపోకలకు ఎలా అనుమతిస్తున్నారు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

*** ఇసుక రవాణా ముఖ్యమా.. ప్రజల ప్రాణాలా?**

‘‘అడవి రక్షణ ముఖ్యమైతే ప్రజల ప్రాణాలు ముఖ్యమా కావా?’’ అంటూ స్థానికులు అధికారులను నిలదీస్తున్నారు. గృహ అవసరాల కోసం ఒక ట్రాక్టర్ ఇసుక తీసుకెళ్లాలన్నా అనుమతులు, నిబంధనలు అంటూ ఆంక్షలు ఉంటాయని, మరి భారీ స్థాయిలో ఇసుక రవాణా జరుగుతున్నప్పుడు అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఓవర్‌లోడ్ వాహనాల రాకపోకలతో రహదారి దెబ్బతినడంతో పాటు ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాతే మేల్కొంటారా? కాటాపూర్ రహదారిపై పరిస్థితులు ప్రమాదకరంగా మారుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ‘‘ప్రాణాలు పోయిన తర్వాత పంచనామాలు చేయడమేనా? అంతకంటే ముందే చర్యలు తీసుకోలేరా?’’ అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



*** రహదారిని వెంటనే విస్తరించాలి**

కాటాపూర్ రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అటవీశాఖకు సంబంధించిన అనుమతులు, ఇతర సాంకేతిక సమస్యలను పరిష్కరించి రహదారి విస్తరణకు మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు. అదే సమయంలో కాటాపూర్ సింగిల్ రోడ్డుపై భారీ ఇసుక వాహనాల రాకపోకలను నియంత్రించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడకముందే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

కోతుల బెడదకు చెక్ పెట్టేందుకు కొత్తపల్లి గ్రామస్తుల కీలక నిర్ణయం

- గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం
- ప్రతి కుటుంబం భాగస్వామ్యంతో కోతులను పట్టించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్ణయం

వరంగల్/ వర్ధన్నపేట, సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలో రోజురోజుకూ పెరుగుతున్న కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపేందుకు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కోతుల కారణంగా ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సమావేశంలో చర్చించి, కోతులను పట్టించి సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కోతుల గుంపులు ఇళ్ల పరిసరాల్లో సంచరిస్తూ ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న నేపథ్యంలో సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం గ్రామస్థులంతా కలిసి ముందుకు రావాలని గ్రామ పెద్దలు పిలుపునిచ్చారు.

*** ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలి**

కోతుల బెడద నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామంలోని ప్రతి కుటుంబం తమ వంతు సహాయ సహకారాలు అందించాలని గ్రామ పెద్దలు కోరారు. అందరి భాగస్వామ్యంతోనే సమస్యను సమర్థవంతంగా పరిష్కరించగలమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 6 గంటలకు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సహాయ సహకారాలను కోరాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామంలో చేపట్టనున్న కోతుల పట్టివేత, తరలింపు కార్యక్రమానికి ప్రజలంతా స్వచ్ఛందంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారానికి గ్రామం ఏకతాటిపైకి.. కోతుల బెడదకు పరిష్కారం కోసం గ్రామ పెద్దలు చొరవ తీసుకుని గ్రామస్థులందరినీ భాగస్వాములను చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు గ్రామస్థుల సహకారంతో పరిష్కరించేందుకు ప్రయత్నించడం అభినందనీయమని పేర్కొంటున్నారు. కోతులను పట్టించే చర్యలు అటవీశాఖ నిబంధనలకు అనుగుణంగా, సంబంధిత అధికారుల సమన్వయంతో చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు..



కేయూ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడిగా డాక్టర్ వి. రాము

- మూడు సంవత్సరాల పాటు బాధ్యతలు.. ఉత్తర్వులు జారీ చేసిన రిజిస్ట్రార్
- డాక్టర్ వి. రాముకు అభినందనలు తెలిపిన బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు నేతల ఘనస్వాగతం

హనుమకొండ/ కే యూ , సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): కాకతీయ విశ్వవిద్యాలయం ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడిగా కొత్తగూడెం విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో అదే విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ వి. రాము నియమితులయ్యారు. కాకతీయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం నియామకానికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం మూడు సంవత్సరాల పాటు అమలులో ఉండనుంది. డాక్టర్ వి. రాము ప్రస్తుత పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు డాక్టర్ కే. సుమలత నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. విభాగానికి సంబంధించిన పాఠ్య ప్రణాళిక రూపకల్పన, సమీక్ష తదితర అంశాల్లో ఆయన కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న డాక్టర్ వి. రామును పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.



Nityam Nigha 13.09.26_Layout 1 9/13/2026 7:26 AM Page 6

గురుకులంలో గందరగోళం
విద్యార్థుల ఆహారంపై ఆరోపణలు

- నాణ్యత లేని భోజనం.. సమయానికి అందని అల్పాహారం అంటూ తల్లిదండ్రుల ఆవేదన
- సమస్యలు తెలుసుకునేందుకు వెళ్లిన బీజేపీ నాయకులను లోపలికి అనుమతించలేదని ఆరోపణ





హనుమకొండ/ ఎల్కతుర్తి, సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎల్కతుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల బాలికల గురుకులంలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, వసతులపై తల్లిదండ్రుల నుంచి తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని, ఉదయం అందించాల్సిన అల్పాహారం కూడా నిర్ణీత సమయానికి ఇవ్వడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు నాంపల్లి మమత గురుకులానికి వెళ్లారు. అయితే ఉన్నత కార్యాలయం అనుమతి కావాలంటూ తమను లోపలికి అనుమతించలేదని వారు ఆరోపించారు. సిబ్బందికి గేట్లు మూసివేయాలని సూచించినట్లు వారు పేర్కొన్నారు. ఉడకని అన్నం.. నాణ్యత లేని కూరలంటూ ఆరోపణలు,

విద్యార్థులకు సరిగ్గా ఉడకని అన్నం, నాణ్యత లేని, రుచిలేని కూరలు అందిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉదయం అందించాల్సిన అల్పాహారం కూడా ఆలస్యంగా ఇస్తున్నారని చెబుతున్నారు. విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతను అధికారులు క్రమం తప్పకుండా పరిశీలించాలని కోరుతున్నారు. వంట సిబ్బందిలో కొందరు మద్యం సేవించి వంట చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. డైనింగ్ హాల్, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత కూడా సరిగా లేదని ఆరోపిస్తున్నారు.

★ పేరెంట్స్ కమిటీకి ప్రాధాన్యత లేదా?

గురుకులంలోని సమస్యలపై ప్రశ్నించేందుకు ప్రయత్నిస్తున్న పేరెంట్స్ కమిటీ సభ్యులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని కొందరు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆహార కాంట్రాక్టర్‌కు టెండర్ కేటాయింపు, ఆహార నాణ్యత తదితర అంశాలపైనా వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లకు టెండర్లు కేటాయించారా? ఆహార సరఫరాను అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నారా? అనే అంశాలపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

★ విద్యార్థుల్లో భయాందోళనలు?

గురుకులంలో సమస్యలు చెప్పుకుంటే ఉపాధ్యాయులు కొడతారనే భయంతో కొంతమంది విద్యార్థులు తమ సమస్యలను బయటకు చెప్పుకోలేకపోతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై గురుకుల యాజమాన్యం లేదా సంబంధిత అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉంది. విద్యార్థులు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునేలా భయరహిత వాతావరణం కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

★ ఉన్నతాధికారులు స్పందించాలి

విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, అల్పాహారం సమయపాలన, వంట సిబ్బంది పనితీరు, డైనింగ్ హాల్ పరిశుభ్రత, టెండర్ కేటాయింపులు తదితర అంశాలపై జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, గురుకుల సొసైటీ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ నాయకులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన అంశం కావడంతో ఆరోపణలను అధికారులు తక్షణమే పరిశీలించాలని కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఆహార నమూనాలను పరిశీలించడంతో పాటు, విద్యార్థులు, తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడి వాస్తవాలను తెలుసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మాదిగ జర్నలిస్టులు
జాషువాను ఆదర్శంగా తీసుకోవాలి

- సమాజంతో పాటు జాతి చైతన్యం కోసం పనిచేయాలి : మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య
- మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి : బూర్గుల నాగేందర్ మాదిగ
- అన్ని సంఘాలకు టీఎంజేఎఫ్ అండగా నిలవాలి : సీనియర్ జర్నలిస్టు పురుషోత్తం



హైదరాబాద్, ఆగస్టు 12 (నిత్యం నిఘా ప్రతినిధి): మాదిగ జర్నలిస్టులు మహాకవి గుర్రం జాషువా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, సదాలక్ష్మి వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని సమాజంతో పాటు జాతి చైతన్యం కోసం పనిచేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య అన్నారు. కోటి బీసీ సాధికార సంస్థ సమావేశ మందిరంలో తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర మూడో మహాసభలు నిర్వహించారు. ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాటికొండ రాజయ్య హాజరై మాట్లాడారు. అన్ని రంగాల్లో వెనుకబడిన మాదిగ సమాజానికి మీడియా పరంగా సొంత గొంతుక అవసరమని ఆయన అన్నారు. మాదిగ జర్నలిస్టులు సమాజంలో చైతన్యం తీసుకురావడంతో పాటు ప్రజా సమస్యలపై ప్రశ్నించే తత్వంతో పనిచేయాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో జాతి పక్షాన గొంతెత్తడంతో పాటు సామాజిక న్యాయం, సమాన వాటా కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాదిగ సమాజంలో పుట్టి వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించిన వ్యక్తుల జీవిత చరిత్రలను నమోదు చేసి, భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మాదిగ జర్నలిస్టులపై ఉందన్నారు. “ఎవరి చరిత్ర వారే రాసుకోవాలి.. ఇతరులు రాస్తే వాస్తవాలు వక్రీకరించే అవకాశం ఉంటుంది” అని పేర్కొన్నారు. 1994లో ఆవిర్భవించిన ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మాదిగ సమాజమే పునాది వేసిందని, తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున నడిపించడంలోనూ మాదిగలు కీలక పాత్ర పోషించారని రాజయ్య గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో డప్పు కొట్టి, పాటలు పాడి, గజ్జ కట్టి కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యపరిచిన వారిలో మాదిగల పాత్ర ముఖ్యమైందని అన్నారు. మాదిగల హక్కుల కోసం తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం ఏర్పాటు చేయడం అభినందనీయమని, సంఘానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

* మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

టీఎంజేఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ మాదిగ మాట్లాడుతూ మాదిగ జర్నలిస్టుల అభివృద్ధికి ప్రత్యేకంగా మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల వృత్తిపరమైన అభివృద్ధి, సంక్షేమం, అవకాశాల కల్పనకు సంస్థాగత సహకారం అవసరమని అన్నారు. సీనియర్ జర్నలిస్టు పురుషోత్తం మాట్లాడుతూ తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం అన్ని సామాజిక సంఘాలకు మద్దతుగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రచయిత పాపని నాగరాజు, సీనియర్ జర్నలిస్టు ఇంద్రవెల్లి రమేష్ ప్రసంగించారు. గౌరవ అధ్యక్షుడు పాల్వాయి బాలయ్య, గౌరవ సలహాదారు సుంచు లింగయ్య, ఉపాధ్యక్షులు పానుగంటి సురేందర్, కాటేపగ హుస్సేన్, ప్రేమ్‌కుమార్, పసుల తిరుపతి, కార్యదర్శులు సుక్క అశోక్, దుబ్బా నాగేష్, రాష్ట్ర కోశాధికారి కుమ్మరి ముఖేష్, రాష్ట్ర నాయకులు సదానందం, మోహన్, అనిల్, శ్రీనివాస్, ఒగ్గు సోమయ్య, మహేష్, దాను, బిక్షపతి, గంట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లపై కనికరం కలగదా..?

- పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి
- శాసనమండలి చైర్మన్‌కు కాంట్రాక్టర్ చందా కుమార్ వినతి



ములుగు జిల్లా, సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): అభివృద్ధి పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని ములుగు జిల్లా కాంట్రాక్టర్ చందా కుమార్ శాసనమండలి చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో అప్పుల భారం పెరిగి కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. రహదారులు, తాగునీటి పథకాలు, పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, సాగునీటి పనులు తదితర అభివృద్ధి కార్యక్రమాలను కాంట్రాక్టర్లు అప్పులు చేసి పూర్తి చేశారని తెలిపారు. అయితే పనులు పూర్తయినప్పటికీ బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో బ్యాంకు రుణాలపై వడ్డీలు, ప్రైవేటు అప్పుల భారం రోజురోజుకూ పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ, మన ఊరు–మన బడి, ప్రత్యేక అభివృద్ధి నిధులు తదితర పథకాల కింద పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు రావాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. బిల్లుల చెల్లింపులు ఆలస్యం కావడంతో కార్మికులకు, నిర్మాణ సామగ్రి సరఫరాదారులకు బకాయిలు చెల్లించలేక కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పూర్తయిన పనుల నాణ్యతను సంబంధిత అధికారులు పరిశీలించి, అర్హత ఉన్న బిల్లులను ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా వెంటనే చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని శాసనమండలి చైర్మన్‌ను చందా కుమార్ కోరారు. కాంట్రాక్టర్లను అభివృద్ధి పనుల్లో భాగస్వాములుగా గుర్తించి, వారి ఆర్థిక ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులపై ప్రభుత్వం తక్షణమే స్పందించి కాంట్రాక్టర్ల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

ప్రజా పాలనకు కాంగ్రెస్
ప్రభుత్వమే నిదర్శనం!

- బీసీల సమస్యలపై పీసీసీ అధ్యక్షుడికి వర్ధన్నపేట కాంగ్రెస్ నేతల వినతి
- బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను ఘనంగా సత్కరించిన బొక్కల ప్రమోద్, కుల్ల యాకాంతం



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను వర్ధన్నపేట అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బొక్కల ప్రమోద్, వర్ధన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ యూత్ ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వెంకట్రావుపల్లి గ్రామానికి సంబంధించిన పలు సమస్యలతో పాటు బీసీలకు సంబంధించిన సమస్యలను పీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా కుల్ల యాకాంతం మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనపై విమర్శలు చేశారు. గతంలో ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నుంచి క్షేత్రస్థాయి ప్రజాప్రతినిధుల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలనను ప్రజల వద్దకు తీసుకువస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సొంత పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులకే ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ లభించని పరిస్థితి ఉండేదని ఆయన విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ సామాన్య కార్యకర్తలు, ప్రజలకు సైతం అందుబాటులో ఉంటున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను నేరుగా పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడమే కాంగ్రెస్ నాయకుల లక్ష్యమని యాకాంతం తెలిపారు. బీసీల సమస్యల పరిష్కారంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 13.09.26_Layout 1 9/13/2026 7:26 AM Page 7

మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం



నిత్యం నిఘా, నేరేడ్ మెట్, సెప్టెంబర్ 12 : పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మల్కాజిగిరి నియోజకవర్గం డివిజన్ 185 వినాయక్‌నగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు, నియోజకవర్గ ఇన్‌చార్జి బద్దం పరశురామ్ రెడ్డి సూచనలతో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నిమజ్జనం సమయంలో నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని కోరారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు షేక్ ఫరీద్, అబ్దుల్ కరీం, అంజయ్య, ఎం.ఆర్. శ్రీను, బాలకృష్ణ గుప్తా, ప్రభాకర్‌రెడ్డి, ఉమేష్, వెంకటేష్, యూ.సాయి, పేపర్ శ్రీను, శ్రీనివాస్‌గౌడ్, లావణ్య, విజయతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

- **రైతులకు సకాలంలో విద్యుత్, గిట్టుబాటు ధర అందడం లేదని ఆరోపణ**
- **రైతుభరోసా, పంట నష్టపరిహారం, రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలి : చిదర సంతోష్**



నిత్యం నిఘా, ములుగు జిల్లా / మల్లంపల్లి, సెప్టెంబర్ 12 : రైతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జెడీ మల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు చిదర సంతోష్ ఆరోపించారు. రైతులకు సకాలంలో నాణ్యమైన విద్యుత్ అందకపోవడంతో పాటు పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాల ద్వారా వ్యవసాయానికి భరోసా కల్పించారని చిదర సంతోష్ పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతుభరోసా నగదు సకాలంలో అందకపోవడం, పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందకపోవడం, రుణమాఫీ విషయంలో అనేక మంది రైతుల్లో అయోమయం, అసంతృప్తి నెలకొనడం వంటి సమస్యలు ఉన్నాయని ఆరోపించారు. సాగునీరు, విత్తనాలు, ఎరువుల విషయంలోనూ రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కరెంట్ కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితిపంటలను కాపాడుకునేందుకు విద్యుత్ కోసం రైతులు అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని చిదర సంతోష్ ఆరోపించారు. గతంలో 24 గంటల విద్యుత్ సరఫరా చేసిన పరిస్థితికి భిన్నంగా ప్రస్తుతం కేవలం ఆరు గంటల విద్యుత్‌తో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించి పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేసి రైతులకు పూర్తి భరోసా కల్పించాలని కోరారు. రైతుల సమస్యలపై ప్రశ్నిస్తామని, రైతుల హక్కుల కోసం పోరాడుతామని చిదర సంతోష్ స్పష్టం చేశారు. రైతులు అధికారుల కాళ్లు మొక్కే పరిస్థితి రాకుండా ప్రభుత్వం, అధికారులు రైతుల సమస్యలను స్వయంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ రాష్ట్ర పంచాయితీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎర్రం లింగం



నిత్యం నిఘా, నిజామాబాద్, సెప్టెంబర్ 12 : తెలంగాణ రాష్ట్ర పంచాయితీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నందిపేట్ గ్రామ పంచాయితీ సర్పంచ్ ఎర్రం లింగం నియమితులయ్యారు.హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పంచాయితీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూమన్న యాదవ్ హైదరాబాద్ లో నియామక పత్రాన్ని అందజేశారు.గ్రామాభివృద్ధి,సర్పంచుల సంక్షేమం కోసం క్రమశిక్షణతో పనిచేయాలని,సంఘం నియమ నిబంధనలకు లోబడి బాధ్యతలు నిర్వర్తించాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఫోరమ్ అధ్యక్షుడు సాయరెడ్డి వున్నారు.ఈ నియామకంపై స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది.సర్పంచుల సమస్యల పరిష్కారానికి,గ్రామ పంచాయితీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎర్రం లింగం తెలిపారు.

కొండారెడ్డిపల్లిలో వినాయక ఉత్సవాలకు పల్లె బ్రదర్స్ భారీ విరాళం

- **రూ.2.50 లక్షల చందా అందించిన పల్లె బాలేశ్వర్**



నిత్యం నిఘా, కేశంపేట, సెప్టెంబర్ 12 : కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలకు పల్లె బ్రదర్స్ అండగా నిలిచారు. గ్రామంలోని వివిధ వినాయక మండపాల నిర్వాహకులు, యువకులను ప్రోత్సహిస్తూ పల్లె బ్రదర్స్‌లో ఒకరైన పల్లె బాలేశ్వర్ రూ.2,50,000 (రెండు లక్షల యాభై వేల రూపాయలు) చందా రూపంలో అందించారు. గ్రామంలోని ప్రతి వినాయక మండప నిర్వాహకులకు, యువకులకు ఈ విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా పల్లె బాలేశ్వర్ మాట్లాడుతూ,, వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించాలని కోరారు. యువత ఐకమత్యంతో ముందుకు సాగుతూ ఉత్సవాల నిర్వహణలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. హిందూ ధర్మం, ఆధ్యాత్మికత, సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా నిర్వాహకులు, యువకులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.పల్లె బాలేశ్వర్ అందించిన భారీ విరాళం పట్ల వినాయక మండపాల నిర్వాహకులు, యువజన సంఘాల నాయకులు, యువకులు హర్షం వ్యక్తం చేశారు. ఉత్సవాలకు అందించిన సహకారానికి పల్లె బ్రదర్స్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పామ్ విజేందర్ రెడ్డి, మాజీ డిప్యూటీ సర్పంచ్ శివకుమార్, సూరం శేఖర్, బుర్రి మల్లేష్ గౌడ్, వార్డు సభ్యుడు బండ మల్లేష్ యాదవ్‌తో పాటు వివిధ యువజన సంఘాల నాయకులు, మండపాల నిర్వాహకులు, యువకులు పాల్గొన్నారు.

కరెంటు మిషన్ పారపాటున తగిలి యువకుడి దుర్మరణం

- **వినాయక మండపం నిర్మాణంలో విషాదం..**



నిత్యం నిఘా, తలకొండపల్లి, సెప్టెంబర్ 12 : వినాయక చవితి ఉత్సవాల కోసం మండపం నిర్మిస్తుండగా జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. తలకొండపల్లి సిఐ జానకిరామ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఈ విషాద ఘటన తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామ ంలోని వినాయక మండపం వద్ద నిర్మాణ పనుల్లో కూరాకుల రాఘవేందర్ (రాకేష్) (23) హనుమాన్ దేవాలయం వద్ద వినాయక మండపం కోసం తన అన్న ఆంజనేయులు, బాబాయ్ లక్ష్మయ్య, మామ మల్లేష్ కలిసి మండపం పైకెక్కి కట్టెలను కట్ చేస్తుండగా కరెంటు మిషన్ ప్రమాదవశాత్తు జారి కుడి చెయ్యి మోచేతి వద్ద తీవ్ర రక్త గాయమై బ్యాలెన్స్ తప్పి కింద పడిపోయాడు అదే సమయంలో కట్టర్ మిషన్ అతని చేతి మీద ఛాతి మీద పడి బలంగా తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందడు,కుటుంబ సభ్యులు తెలిపారు.రాకేష్ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. ప్రస్తుతం రాకేష్ కూడా మృతి చెందడంతో తల్లి సావిత్రి, అన్న ఆంజనేయులు, అక్క అఖిల తీవ్ర విషాదంలో మునిగిపోయారు. పేద కుటుంబానికి చెందిన రాకేష్ చిన్న వయసులోనే మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.సమాచారం తెలుసుకున్న గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.రాకేష్ మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుని తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.

22ఏ పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు



- **ప్రజల కన్నీళ్లు తుడిచి.. భూసమస్యలు పరిష్కరించాలి - మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి**

నిత్యం నిఘా,నేరేడ్ మెట్,సెప్టెంబర్ 12 : 22ఏ జాబితా పేరుతో ప్రజల భూములను నిషేధిత జాబితాలో చేర్చి వారి ఆస్తులపై అనిశ్చితి సృష్టించవద్దని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం కాకుండా వారి భూసమస్యలను సానుభూతితో పరిష్కరించి, వారి కన్నీళ్లు తుడవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో భూ సమస్యలపై ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.మల్కాజిగిరి నియోజకవర్గంలో సుమారు 30 వేల ఇళ్లను 22ఏ జాబితాలో చేర్చారని, దీంతో వేలాది కుటుంబాలు తమ ఆస్తుల భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. 22ఏ సమస్య పరిష్కారం కోసం మంత్రులు, అధికారులను పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ''తొక్కుకుంటూ వచ్చా'' అని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అయితే ప్రజలను మాత్రం తొక్కొద్దని కోరారు.

వేలాది కుటుంబాలకు ఇబ్బందులు

యాప్రాల్ జూపల్లి హోమ్స్‌లో సుమారు 300 మంది ఎండోమెంట్ ఆస్తులను వేలం ద్వారా కొనుగోలు చేసినప్పటికీ, అధికారుల నిర్లక్ష్యంతో వాటిని 22ఏ జాబితాలో చేర్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హెచ్ఎండీఏ అనుమతితో ఉన్న హరిప్రియ కాలనీని కూడా 22ఏ జాబితాలో చేర్చారని, అందులో కొంత భాగం చెరువు స్థలంగా ఉందనే కారణంతో మొత్తం కాలనీ వాసులను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు.సీతారాంనగర్‌లో సుమారు నాలుగు ఎకరాల్లో ఉన్న 300 ప్రభుత్వ భూములను కాపాడాలి

మచ్చబొల్లారం ప్రాంతంలోని తోళ్ల పరిశ్రమకు సంబంధించిన సుమారు నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రంథాలయం, ఉప రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరినా, భూములు కోర్టు వివాదాల్లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల అవసరాలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను సద్వినియోగం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అల్వాల్ గ్రామకంఠంలోని 11 గుంటల స్థలంలో అగ్నిమాపక కేంద్రం మంజూరైనప్పటికీ, ప్రైవేటు వ్యక్తులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకోవడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రజల భద్రతకు కీలకమైన అగ్నిమాపక కేంద్ర నిర్మాణానికి ఉన్న న్యాయపరమైన అడ్డంకులను తొలగించి పనులు ప్రారంభించాలని కోరారు.అల్వాల్‌లోని సర్వే నంబర్లు 582, 583లో ఉన్న పట్టణ భూగరిష్ఠ పరిమితి భూములు, పార్కు స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని, ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 58, 59 జీవోల ద్వారా పేదలకు పట్టాలు అందించి భరోసా కల్పించామని గుర్తుచేసిన ఎమ్మెల్యే.. ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రజల ఆస్తులకు భద్రత కల్పించి భూసమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, జూపల్లి కృష్ణారావు, కేపీ వివేకానందగౌడ్, బండారి లక్ష్మారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 13.09.26_Layout 1 9/13/2026 7:26 AM Page 8

నిత్యం నిఘా తెలుగు దినపత్రిక

మంథని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముట్టడి

- **24గంటల కరెంటు ఇస్తామని హామీ ఇచ్చి7గంటల కరెంటు**
- **విద్యుత్ డి.ఈ కి వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు-రైతులు**





నిత్యం నిఘా, మంథని, సెప్టెంబర్ -12 : బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమం లో భాగంగా శనివారం మంథని పట్టణంలో ని అంబేద్కర్ చౌక్ వద్ద రైతులతో కలసి బీజేపీ నాయకులు మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముట్టడించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, చల్లా నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీల్ రెడ్డి మాట్లాడుతూ...రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకొనే కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతు గోస కనిపించడం లేదా, 24గం కరెంటు ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చి ఇప్పుడు కేవలం 7గంటల కరెంటు ఇవ్వలేని పరిస్థితి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ధోరణి అర్థం అవుతుంది.ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్వంత నియోజకవర్గం లో రైతులు నీళ్ల కోసం ధర్నా చేయడం సిగ్గు చేటు, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ మంత్రి శ్రీధర్ బాబు 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారు వెంటనే రాజీనామా చేయాలనీ, బీజేపీ పాలిత ప్రాంతాలను చూసి సిగ్గు తెచ్చుకోవాలి అన్నారు. వెంటనే రైతులకు 24గంటల నాణ్యమైన కరెంటు అందించాలని లేదంటే ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలోరాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొండపక సత్యప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము, నియోజకవర్గ కో కన్వీనర్ నంపెల్లి రమేష్,మండల అధ్యక్షులు విరబోయిన రాజేందర్, సబ్బాని సంతోష్,కొయ్యడ సతీష్, పగే రంజిత్, కొండ్రు లక్ష్మణ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఎల్కా సదానందం,సీనియర్ నాయకు రాపర్తి సంతోష్,మట్ట శంకర్, మళ్లారపు అరుణ్,చిలువేరు సతీష్,విశ్వాతేజ,సామల అశోక్, భానుప్రకాశ్, తొట్ల రాజు, రైతులు రమేష్, శ్రీనివాస్,రాజు,ఓదెలు, వెంకటేష్, రామూర్తి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీమహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ సభ్యులు దైవ దర్శనం

- **వర్షాలు బాగా కురవాలని శ్రీశైలం మల్లికార్జున స్వామినీ కోరుకున్నారు**
- **శ్రీమహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ అధ్యక్షుడు అంతటి రాజుగౌడ్.**
- **వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్**



నిత్యం నిఘా, ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 12 :
మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన శ్రీ మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ అధ్యక్షుడు అంత టి రాజుగౌడ్ ఆధ్వర్యంలో శ్రీ మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ సభ్యులు శ్రీశైలం యాత్రకు బ యలుదేరి వెళ్లారు.శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు సందర్భంగా శ్రీ మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ అధ్యక్షుడు అంతటి రాజుగౌడ్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ మాట్లాడుతూ వర్షా లు సరైన సమయానికి కురవక రైతులు నాన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని వర్షాలు బాగా కురిసి రైతుల పంటలు బాగా పండి అందరూ సుఖసంతోషాలతో జీవించేలాచూడాలని ఆ శ్రీశైల మల్లికార్జున స్వామిని మొక్కుకుంటూ ప్రత్యేక పూజలు చేశామన్నారు.కార్యక్రమం లోశ్రీ మ హాలక్షి సిండికేట్ గ్రూప్ సభ్యులు నూతన గంటి కృష్ణ మడపాకుల యాదగిరి, పల్లె శ్రీనివాస్ గౌడ్ ,యాట జలంధర్ ముదిరాజ్ ,ఎన్నుదుల మహేష్ అంతటి కృష్ణగౌడ్ ,ఆమంచ సంతోష్ ,నూతనగంటి చిన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాల ధృవతార కామ్రేడ్ సీతారాం ఏచూరి.

- **రెండో వర్ధంతి సందర్భంగా సిపిఐ ఎం తుర్కయంజాల్ కమిటీ ఘన నివాళి**
- **తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ సభ్యుడు మండల సత్యనారాయణ.**



నిత్యం నిఘా, ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 12 :
భారతదేశ మార్క్సిస్టు మేధావి, ప్రజాస్వామ్యం సెక్యులరిజం కోసం దేశ సమైక్యత కోసం తుది శ్వాస వరకు కృషి చేయడమేకాకుండా, మతోన్మాద మనువాద శక్తులకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య అభ్యుదయ లౌకిక శక్తులను ఏకం చేసి ఇండియా బ్లాక్ స్థాపించడంలో ప్రముఖ పాత్ర పోషించి, ప్రపంచ దేశాలలో ప్రత్యేక గుర్తింపు పొందిన మార్క్సిస్టు నేత, మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి సందర్భంగా వారికి సిపిఐ(ఎం) తుర్కయంజాల్ కమిటీ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ పార్టీ కార్యాలయంలో సీతారాం ఏచూరి రెండో వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐఎం తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.సీతారాం ఏచూరి భారతదేశంలో వామపక్ష ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. విద్యార్థి ఉద్యమం నుంచి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ అంచెలంచెలుగా జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగారని పేర్కొన్నారు.దేశంలో సామాజిక న్యాయం, లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, కార్మికులు, రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన నిరంతరం పోరాడారని తెలిపారు. పార్లమెంటరీ వ్యవస్థపై లోతైన అవగాహనతో ప్రజా సమస్యలను సమర్థవంతంగా ప్రస్తావించడమే కాకుండా, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విస్తృత ప్రజా ఐక్యత కోసం కృషి చేశారని అన్నారు.సీతారాం ఏచూరి గొప్ప రాజకీయ నాయకుడే కాకుండా.మార్క్సిస్టు సిద్ధాంతంపై లోతైన అవగాహన కలిగిన మేధావి, అద్భుతమైన వక్త, రచయిత అని కొనియాడారు. విభిన్న రాజకీయ పార్టీలతో ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల ఐక్యత కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.“ప్రజల కోసం పోరాడే ప్రతి ఉద్యమంలో సీతారాం ఏచూరి ఆలోచనలు, సిద్ధాంతాలు, పోరాట స్ఫూర్తి మనకు మార్గదర్శకంగా నిలుస్తాయి” అని పేర్కొన్నారు.ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని, కార్మికులు, రైతులు, పేదలు, సామాన్య ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.కామ్రేడ్ సీతారాం ఏచూరి అమర్ రహేసీతారాం ఏచూరి ఆశయాలు వర్ధిల్లాలి!ప్రజా ఉద్యమాలు వర్ధిల్లాలిఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ సభ్యులు మండల సత్యనారాయణ ,కె అరుణ్ కుమార్ ,ఇల్లూరు భాస్కర్ ,కే శారద ,పి శ్రీనివాసులు సుందరయ్య నగర్ శాఖ కార్యదర్శి ఐతరాజు కృష్ణ ఎంఎస్ఆర్ నగర్ శాఖ సభ్యుడు నకుమల్ల యాదగిరి పార్టీ సీనియర్ నాయకులు మద్దెల యాదయ్య ఏ మాధవరెడ్డి శ్రీశైలం తుర్కయంజాల్ డివైఎఫ్ఐ కార్యదర్శి జి సాయి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి

- సోలిపేట సర్పంచ్ రాజేందర్ రెడ్డి

- **రూ.30 లక్షల హెచ్ఎండీఏ నిధులతో సీసీ రోడ్డు పనుల ప్రారంభం**



నిత్యం నిఘా, షాబాద్, సెప్టెంబర్ 12 : గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని సోలిపేట సర్పంచ్ రాజేందర్ రెడ్డి తెలిపారు. షాబాద్ మండలంలోని సోలిపేట గ్రామంలో హెచ్ఎండీఏ నిధులు రూ.30 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామంలో రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. గ్రామంలో ఇంకా పరిష్కరించాల్సిన సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాన్ని అన్ని రంగాలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులకు సర్పంచ్ రాజేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబెర్ కృష్ణ యాదవ్ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, నాయకులు, గ్రామస్థులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఖిల్లా మైసమ్మ తల్లి బోనాలు

- **అంగరంగ వైభవంగా బోనాల సమర్పణ..**
- **సర్పంచ్ వానరాశి రాములమ్మ, తనయుడు వానరాసి వెంకటేష్**
- **మాజీ ఎం పి పి సిఎల్ శ్రీనివాస్ యాదవ్,మాజీ ఎంపీటీసీ అంబాజీ**



నిత్యం నిఘా, తలకొండపల్లి, సెప్టెంబర్ 12 :
తలకొండపల్లి: మండలంలోని వెల్జాల్ గ్రామంలో ఖిల్లా మైసమ్మ బోనాల పండుగను గ్రామ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా శనివారం నిర్వహించారు.సర్పంచ్ వానరాశి రాములమ్మ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి వాడ నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు.డప్పు వాయిద్యాలు, డమరుకాల మోతలు, విన్యాసాలు, గ్రామ యువకుల ఉత్సాహంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించడంతో గ్రామం భక్తులతో కిక్కిరిసింది. బోనాల పండుగ సందర్భంగా ఆలయాలన్నీ ప్రత్యేక అలంకరణతో ఏర్పాటు చేయడం జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెల్జాల్ గ్రామంలో ఈసారి ఖిల్లా మైసమ్మ తల్లి బోనాల పండుగ ఎంతో అద్భుతంగా, భక్తిభావంతో నిర్వహించడం అభినందనీయమన్నారు.గ్రామ సర్పంచ్ రాములమ్మతో పాటు తనయుడు వాన రాశి వెంకటేష్ బోనాల నిర్వహణకు సహకరించిన గ్రామ పెద్దలు, యువకులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివ విజయలక్ష్మి విజయ్ కుమార్, జిల్లా కో ఆప్షన్ మాజీ సభ్యుడు ముజీబ్ రహమాన్, ఏం సి డైరెక్టర్ చిర్ల వెంకట్ రెడ్డి,రిపోర్టర్ విష్ణువర్ధన్ యాదవ్, విజయ్ యాదవ్, ,గ్రామ పెద్దలు, మాజీ ఎంపీటీసీ అంబాజీ, వార్డు సభ్యులు, గ్రామ యువకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com